# దారితప్పిన కొడుకు

జి. ఉషావినత్



శ్యామల గాంధీమెమోరియల్ హైస్కూలు ముందు రిక్షదిగి, "పదినిముషాల్లో వచ్చేస్తాను. ఆగుతావా?" అని అడిగింది రిక్షవాడిని. వాడు "పైసలు ఎక్కువ యివ్వాల్సి వస్తుందమ్మా" అని అనడంతో డబ్బులిచ్చేసి, స్కూలు ఆవరణలోకి నడిచింది. క్లాసులు నడుస్తూ వుండడంచేత ఆవరణంలో యించుమించు నిశ్శబ్దంగా వుంది. శ్యామల నెలకొకసారి కొడుకు స్కూలుఫీజు కట్టడానికి అక్కడికి వస్తూనేవుంటుంది. అందుకే తిన్నగా ఆఫీసులో జీతాలుకట్టే చోటికి వెళ్ళి,

"ఎన్. శ్రీధర్, ఆరవతరగతి. 'బి' సెక్షన్" అంటూ డబ్బుతీసి కౌంటర్లో పెట్టింది. కౌంటర్లో క్లర్కు—

"ఫైన్ కట్టాల్సి వుంటుందండీ!" అని అంటూ డబ్బు లెఖ్ఖ చూసి ఫైన్‌తో సహావుండటం గమనించి, రసీదు చేతికి అందించాడు. ప్రతీనెలా జీతాలు రాగానే పిల్లల స్కూలు ఫీజులు కట్టేయాలనుకుంటూ డబ్బు విడిగాతీసి వుంచడం, మళ్ళీ అంతలో యేదో అనుకోని అవసరానికి ఆ డబ్బు వాడుకుని, ఎక్కడో అప్పుతెచ్చి ఫీజులు ఫైన్లతో సహా కట్టడం జరుగుతోంది. డబ్బు పిల్లల చేతికి యిస్తే పారేస్తారేమోననే భయంతో ఆమే తీరిక చేసుకుని వచ్చి జీతం కడుతూవుంటుంది. చిన్న పిల్లలు యిద్దరూ. యింటి దగ్గర వున్న ఇందిరా ప్రైమరీ స్కూలు. ఫీజు కట్టాలంటేనే యింత దూరం వచ్చినట్టూ రావల్సి వుంటుంది.

శ్యామల ఆలోచిస్తూ హెడ్‌మాస్టరు గదివైపు నడిచింది. ఆస్కూల్లో పిల్లల్నిగానీ, వాళ్ళ క్లాసు టీచర్లనిగానీ, స్కూలు జరుగుతున్న సమయంలో కలుసుకోవాలంటే హెడ్‌మాస్టరుగారి పర్మిషన్‌తో ఆయన గదిలోనే కలుసుకోవాలి. తిన్నగా క్లాసు రూముకి వెళ్ళడానికి వీల్లేదు. ఆ హెడ్‌మాస్టరు మహాఛండశాసనుడు. స్కూలు రూల్సుకి విరుద్ధంగా యేది జరిగినా అటు పిల్లలకి దెబ్బలు, టీచర్లకీ, పిల్లల తల్లిదండ్రులకి చీవాట్లు తప్పవు. అయితేనేం, ఎప్పుడూ ఆ స్కూలు రిజల్ట్సు సెంట్ పర్సెంటే! అందుకే యింటికి దూరమైనా, ఫీజు కాస్త ఎక్కువైనా శ్యామల శ్రీధర్‌ని ఆ స్కూల్లోనే చేర్పించింది. శ్యామల వెళ్ళేసరికి, యెర్రగా బొబ్బలెక్కిన చేతుల్ని కన్నీళ్ళతో వూదుకుంటూ, హెడ్‌మాస్టరు గదిలో నించి బయటికి వస్తున్నాడు కుర్రాడు. శ్యామల మనసు చివుక్కుమంది. పాపం! ఏం పొరపాటు చేశాడో? అయినా అంతలా కొట్టడమేమిటో? అనుకుంది. ఆ క్షణంలో ఆమె కళ్ళ ముందు కొడుకు పసిమొహం మెదిలి మనస్సు ఆర్ద్రతతో నిండిపోయింది. ప్యూన్ లోపలికి వెళ్ళి వచ్చునని చెప్పగానే శ్యామల హెడ్‌మాస్టరుగారి గదిలో అడుగుపెడుతూ,

"నమస్కారమండీ!" అంది. ఆయన ప్రసన్నంగా తల వూపి ముందున్న కుర్చీ చూపించి.

"కూర్చోండమ్మా!" అన్నాడు. శ్యామల కూర్చుంటూ,

"మా అబ్బాయి, ఎన్. శ్రీధర్ అన్నవాడు ఆరోక్లాసు 'బి' సెక్షన్‌లో చదువుతున్నాడు. ఫీజు కట్టడానికి వచ్చి, అలాగే మావాడు యెలా చదువుకుంటున్నాడో కనుక్కుందామని యిటు వచ్చాను" అంది. ఆయన చేతిలోవున్న కాగితాల్ని పక్కకి పెట్టి, ట్రేలోని కాగితాల్లో దేనికోసమో వెతుకుతూ,

"మీ అబ్బాయి పేరేమిటన్నారూ? ఎన్. శ్రీధరా?" అని అడిగాడు. శ్యామల ముందుకి వంగి.

"అవునండీ! సిక్స్త్‌స్టాండర్డ్, 'బి' సెక్షన్‌లో వున్నాడు" అంది. ఆయన చేతిలోని చిన్న కాగితాన్ని ఒకసారి పరీక్షగా చూసి,

"నేనే మీకు కబురు చేద్దామనుకుంటున్నాను. మీ అబ్బాయి గత పదిరోజుల్నించీ స్కూలుకి రావటం లేదనీ, లీవ్ లెటర్ కూడా రాలేదనీ వాళ్ళ క్లాసు టీచరు రాసిచ్చిన రిపోర్టు చూడండి!" అంటూ ఆ కాగితాన్ని ఆమె చేతికి అందించాడు. శ్యామల తెల్లబోతూ అందుకుంది. ఏమిటి యీయన

అంటున్నది? శ్రీధర్ పదిరోజుల్నించి స్కూలుకి రావటం లేదా? అదెలా సంభవం? రోజూ స్కూలు వేళకి పుస్తకాలు, టిఫెను కారియరు తీసుకుని యిల్లువదిలి, మళ్ళీ ఠంచనుగా స్కూలువదిలే వేళకి యిల్లు చేరుతున్న శ్రీధర్‌గాడు, రోజంతా స్కూల్లో లేకపోతే యెక్కడ గడుపుతున్నట్టు? శ్యామలకి బుర్ర గిర్రున తిరిగినట్లైంది. శ్యామల కలవరపాటుని మరో విధంగా అర్థం చేసుకున్న హెడ్‌మాస్టరు,

"మీరు ఏవిషయమూ తెలియచెయ్యకుండా పిల్లాడిని స్కూలుకి పంపడం మానేస్తే మేము యేమనుకోవాలి చెప్పండి?" అన్నాడు కాస్త నిష్ఠూరంగా ఆయన మాటలతో శ్యామల చటుక్కున తేరుకుంది

ఆయన ధోరణి శ్యామలకి కొత్తకాదు. తన ఆరాటం యేమాత్రం పనిగట్టినా "పిల్లల పట్ల తల్లిదండ్రుల నిర్లక్ష్య వైఖరి" ని గురించి లెక్చరిచ్చి, యింత ఆలశ్యంగా విషయం తెలుసుకున్నందుకు తల వాచేటట్లు చీవాట్లు పెడతాడు. పిల్లల తలిదండ్రులకి కూడా క్రమశిక్షణ అవసరం అని నమ్మే వ్యక్తి ఆయన! అందుకే తన కంగారు బయట పెట్టకుండా,

"అ మాట చెప్పి పోదామనే వచ్చేనండీ! వాడికి కాస్త వంట్లో నలతగా వుంది. రేపట్నించీ స్కూలుకి వస్తాడు" అంది. ఆలస్యంగానైనా వచ్చి చెప్పినందుకు సంతోషమనీ, మర్నాడు లీవు లెటరుతోసహా కుర్రాడిని స్కూలుకి పంపించమనీ చెప్పి, శ్యామల వెళ్ళడానికి అనుమతి యిచ్చాడాయన. శ్యామల 'బ్రతుకు జీవుడా!' అనుకుంటూ ఆయన దగ్గర్నించి బయటపడింది. స్కూలు ఆవరణ దాటగానే కొడుకుని గురించిన ఆలోచనలు మళ్ళీ ఆమెని చుట్టు ముట్టాయి. ఈ వెధవ రోజూ యెటుపోతున్నట్టు? అసలు యెందుకిలాగ చేస్తున్నాడు? తను గమనించలేదుగానీ, పది రోజులుగా పట్టుమని పది నిముషాలు పుస్తకం పట్టుకోవడం లేదు. అంతకుముందు గంటల తరబడి. "హోమ్ వర్కుంది. మాస్టారు చంపేస్తారు" అంటూ పుస్తకాలు ముందేసుకు కూర్చునే కుర్రాడు, అలా రాత్రి అన్నం తినగానే పక్కచేరుతూ వుంటే కనిపెట్టలేని తను యెంత తెలివిమాలిన తల్లి అయి వుండాలి? అయినా తిన్న తిండి అరక్కగానీ, ఈ వెధవకి యిదేం రోగం? నానా బాధలూ పడి, బోలెడంత ఫీజు పోసి లక్షణంగా 'చదువుకోరా నాయనా!' అని పంపిస్తూ వుంటే స్కూలు ఎగ్గొట్టి వీడు యెక్కడ తిరుగుతున్నట్టు? ఇవాళ పాపం! యీ స్కూలు ఫీజు కట్టడానికి ఆయన యెవరి ముందు చెయ్యిచాచాల్సి వచ్చిందో? పదేళ్ళ పిల్లాడికి బొత్తిగా కష్టం, సుఖం తెలియకపోతే ఎలాగ? శ్యామల ఆందోళన ముందు దుఃఖంగా మారి, తరవాత కొడుకుమీద అంతులేని కోపంగా రూపుదాల్చింది. ఇంటికిరానీ వెధవ పని చెప్తాను! అని పళ్ళు నూరుకుంటూ అన్యమనస్కంగా యిల్లు చేరి అటు కొడుకు రాకకోసం, భర్త రాకకోసం ఎదురుచూస్తూ ఎలాగో సాయంత్రందాకా గడిపింది.

❋

తల్లి ఆరోజు స్కూలుకి ఫీజు కట్టడానికి వెళ్ళిందనిగానీ, తన నాటకం బయటపడిందని గానీ తెలియని శ్రీధర్ మామూలుగానే ఇంటికి వచ్చి పుస్తకాల సంచి మేకుకి తగిలిస్తూ,

"అమ్మా! ఆకలేస్తోంది. ఏదైనా పెట్టవూ!" అంటూ యింట్లోకి కేకవేశాడు. వాడి రాకకోసమే చింతబరికెతో సహా ఎదురు చూస్తున్న శ్యామల, బెత్తం వాడికి కనిపించకుండా వెనక్కి పట్టుకుని ముందుకి వస్తూ,

"ఆకలి కాదూ మరి? రోజంతా స్కూల్లో ఎంతో కష్టపడి చదువుకుని వచ్చేవాయే!" అంది వ్యంగ్యంగా. తల్లిమాటలకి. చూపులకి హడిలిపోయిన శ్రీధర్ బెదురుతూ ఒకడుగు వెనక్కి వెయ్యబోయాడు. శ్యామల చటుక్కున వాడి చెయ్యి పట్టుకుని,

"దొంగవెధవా! మాయలమారి వెధవా! రోజూ స్కూలుకి వెళుతున్నానని చెప్పి వూరమ్మట షికార్లు కొడతావట్రా?" అంటూ వాడు వూహించనంత జోరుగా చింతబరికెతో కాళ్ళమీద, చేతుల మీద, అందిన చోటల్లా కొట్టసాగింది. శ్రీధర్ ఆమె చేతిలోనించి తప్పించుకోలేక, రివ్వు రివ్వున తగులుతున్న దెబ్బలకి విలవిల్లాడుతూ,

"అమ్మా! ఇంకెప్పుడూ యిలా చెయ్యను. కొట్టకే! అమ్మో చచ్చిపోతున్నాను కొట్టకమ్మా!" అని అరవసాగేడు. శ్యామలకి వాడిమీద యెలాంటి జాలీ కలగలేదు.

"చెప్పు! ఎందుకిలా చేస్తున్నావు? ఏరౌడీ వెధవల్తో తిరుగుతున్నావు? చెప్పు!" అంటూ మళ్ళీ కొడుకుని కొట్టడానికి యెత్తిన చేతిని ఎవరో పట్టుకోవడంతో వెనక్కి తిరిగింది. ఆ వేళంలో, కోపంలో భర్త యెప్పుడు లోపలికి వచ్చాడో ఆమె గమనించలేదు. చిన్న పిల్లలిద్దరూ బిక్కచచ్చిపోయి ఒకమూల నిల్చుని వున్నారు. భార్య చేతిలోని కర్రలాక్కుని విరిచేస్తూ,

"పిచ్చిగానీ పట్టిందేమిటి? వాడిని అలా బాదేవంటే ఛస్తాడు." అన్నాడు మాధవరావు కాస్త కోపంగా. అతనెప్పుడూ భార్య పిల్లల్ని అంతలా కొట్టగా చూడలేదు. భర్త మాటలకి శ్యామల కోపమంతా దుఃఖంగా మారింది. గట్టిగా యేడుస్తూ,

"చావనివ్వండి! పీడ విరగడైపోతుంది. ఇలాంటి వాడు వుండి వుద్ధరించే కంటే ఛస్తేనే మేలు." అంది. మాధవరావుకి ఆమె మాటలకి వళ్ళు మండింది.

"నోటికి శుద్ధీ బద్ధం లేకుండా యేమిటా మాటలు? అసలు యింతకీ వాడేంచేశాడు!" అనడిగాడు. శ్రీధర్ వళ్ళంతా చర్మం చిట్లి అక్కడక్కడ రక్తం చిమ్ముతోంది. ఊపిరి కూడా తిప్పుకోలేకుండా వెక్కిళ్ళు పెడుతున్నాడు, శ్యామల యింకా గట్టిగా యేడుస్తూనే,

"వీడూ! ఈ వెధవ యేంచేస్తున్నాడో తెలుసా? రోజూ స్కూలు యెగ్గొట్టి, యెక్కడెక్కడో తిరిగి యింటికి వస్తున్నాడు. ఇవాళ జీతం కట్టడానికి స్కూలుకి వెళ్ళితే పది రోజుల్నించీ స్కూలుకి రావడంలేదని చెప్పారు...." అంది. ఆమె మాటలు పూర్తికాకుండానే మాధవరావు ముందుకి వెళ్ళి కొడుకు జుట్టు పట్టుకుని గుంజుతూ, కోపంతో యెర్రబడ్డ కళ్ళతో.

"ఏరా? ఎక్కడ నేర్చుకున్నావు యీ వేషాలన్నీ? చెప్పు రోజూ స్కూలుకి వెళ్ళకుండా యెక్కడ తిరుగుతున్నావు? మాట్లాడవేం?" అంటూ గద్దిస్తూ అడిగాడు. తల్లి దెబ్బలతో సగం చచ్చివున్న శ్రీధర్‌కి తండ్రి గద్దింపుతో పైప్రాణాలు పైనే యెగిరిపోయి నట్టయాయి. నోటమాట రాలేదు. మాధవరావుకి నిజానికి పిల్లలంటే పంచప్రాణాలు, ఇంతదాకా అసలు యేనాడూ పిల్లలమీద చెయ్యి వెయ్యలేదు. కాని ఆరోజు భార్య చెప్పిన విషయం అతను ఎదురు చూడనిది. కొడుకు చదువు మానేసి, తమ కళ్ళుకప్పి వూరమ్మట బలాదూర్ తిరుగుతున్నాడంటే యే తండ్రికి కోపం రాదు? మాధవరావు కొడుకు సమాధానం కోసం యెదురు చూడకుండా జుట్టుపట్టుకుని,

"చెప్పు! రాస్కెల్! ఎక్కడికి పోతున్నావు? ఇప్పట్నించే నీకీ వేషాలా?" అంటూ కొడుకు

[17 వ పేజీ చూడండి]

[దారి తప్పిన కొడుకు : 14 వ పేజీ నుంచి]

తల గోడకేసి బలంగా కొట్టాడు. శ్రీధర్ 'అమ్మో' అంటూ బలహీనంగా యేడుస్తూ అక్కడే కూలబడి పోయాడు. భర్త ఆవేశానికి హడిలి పోయిన శ్యామల,

"చాల్లేండి! రేపు స్కూలుకి తీసుకెళ్ళి ఆ హెడ్ మాస్టరికి అప్పజెపితే సరి! ఆయనే వీడి వేషాలన్నీ సరిచేస్తాడు." అంటూ అతని చెయ్యి పట్టుకుని పక్కకి లాగింది. మాధవరావు కొడుకుని నానాతిట్లూ తిడుతూనే బట్టలు మార్చుకుని టిఫిన్ తినడానికి కూర్చున్నాడు. ఆపూట శ్యామల శ్రీధర్‌కి టిఫెను పెట్టలేదు. భోజనాల వేళదాకా తండ్రి కొట్టినప్పుడు పడిపోయిన చోటే పడి యేడుస్తున్న శ్రీధర్‌ని ఎవరూ పలకరించలేదు. అందరితోపాటు శ్రీధర్‌కూడా కంచంలో అన్నం వడ్డించి, వాడిని పిలవబోతున్న శ్యామలని భర్త వారించి,

"ఓ పూట తిండి లేకపోతే వాడేం చచ్చి పోడులే ఆకలి అంటే యేమిటో తెలిసిరానీ?" అనడంతో శ్యామల మరేం మాట్లాడలేక పోయింది. కాని ఆమె మాతృహృదయం వాడిని పస్తుపడుకోబెట్టి తను కడుపునిండా తినడానికి వప్పుకోలేదు. అందుకే కొడుకుతోపాటు ఆమె కూడా ఆపూట పస్తు పడుకుంది.

❋

మర్నాడు పొద్దున్న శ్యామల మిగతా పిల్లలతో పాటు శ్రీధర్‌కి కూడా పెందరాళే కడుపునిండా చద్దన్నం పెట్టింది. వాడు పుస్తకాలు సర్దుకుని స్కూలుకి బయలుదేర బోతూవుంటే,

"ఉండు! నేనూ మీ స్కూలుకి వస్తాను. అప్పుడే అయిపోయిందనుకుంటున్నావేమిటి? నిన్ను తీసుకెళ్ళి మీ హెడ్‌మాస్టరికి అప్పచెప్తాను. ఇంక ఆయన నిన్నేంచేసుకున్నా నా సంబంధమేమీ వుండదు.' అంటూ వాడిని ఆపింది. వాడు తల్లి వైపు ఒక్క క్షణం భయంగా చూసి, భుజాన్ని తగించుకున్న పుస్తకాల సంచీ మళ్ళీ మేకుకి తగిలించేశాడు. నిజానికి శ్యామల వాడిని గురించి హెడ్‌మాస్టరికి చెప్పదలుచుకోలేదు. నాలుగు రోజులపాటు, రోజూ తనో, భర్తో యెవరికి వీలైతే వాళ్ళు కొడుకుని స్కూలుకి తీసుకెళ్ళి దిగబెట్టాలని నిశ్చయించుకున్నారు. వాడిని మరి కాస్త భయంలో వుంచడం మంచిదనుకుంటూ శ్యామల వాడితో అలా చెప్పింది. శ్యామల చిన్న పిల్లలిద్దర్నీ సిద్ధంచేసి స్కూలుకి పంపించేసి, చిందర వందరగా వున్న వంటిల్లు సర్దుకుని స్నానం చెయ్యడానికి వెళ్ళబోతూ వీధి వైపు తొంగి చూసింది. శ్రీధర్ వరండాలో నీరెండలో పరధ్యానంగా కూర్చుని వున్నాడు. వాడి కాళ్ళమీదా, చేతులమీదా నిన్నటి దెబ్బల వాతలు కొద్దిగా వుబ్బి, చిమ్మిన రక్తం పెచ్చుకట్టి యెండలో మెరుస్తున్నాయి. అది చూసిన శ్యామల హృదయం జాలితో నీరైపోయింది. ఛీ! తనేనా అంతంత దెబ్బలు కొట్టిందీ! అనుకుంది. స్నానంచేసి వచ్చి కాస్త వేసలైనో, కొబ్బరి నూనో రాయాలి వాటికి అనుకుంటూ,

"స్నానం చేసి వస్తాను, వుండు!" అని కొడుకుని హెచ్చరించి స్నానానికి వెళ్ళిపోయింది. స్నానంచేసి తలదువ్వుకుని, చెప్పులు వేసుకుందామని వరండాలోకి వచ్చినప్పుడుగాని, వరండాలో శ్రీధర్ లేకపోవడం గమనించలేదు ఆమె! అరె! నేనూ వస్తాను వుండమంటే వుండకుండా వెళ్ళిపోయాడే వీడు! మాటంటే మరీ ఖాతరు లేకుండా పోతోంది గాడిదకి! అనుకుంటూ గేటు దాకా వచ్చి చూసింది. ఎక్కడా కనుచూపు మేరలో శ్రీధర్ కనిపించలేదు. శ్యామలకి కొడుకు చెప్పినమాట విననందుకు మరుగున పడిన కోపం మళ్ళీ ముంచుకువచ్చింది. 'వీడిని యిలా వదిలితే లాభం లేదు. నిజంగా ఆ హెడ్‌మాస్టర్‌కి రిపోర్టు చెయ్యాల్సిందే!' అనుకుంటూ వీధి తలుపు తాళం వెయ్యడానికి తాళం కప్ప తీసుకోడానికి లోపలికి వచ్చిన శ్యామల దృష్టి గోడకి తగిలించి వుంచిన వాడి పుస్తకాల సంచీ మీద పడింది. 'పుస్తకాలు తీసుకెళ్ళకుండా వీడెటు వెళ్ళి వుంటాడు? స్కూలుకి పుస్తకాలు తీసుకెళ్ళకుండా వెళ్ళితే మాస్టరు క్లాసులో అడుగు పెట్టనివ్వరు కదా!' శ్యామల ఆలోచిస్తూ మళ్ళీ వీధిలోకి వచ్చి నాలుగువైపులా చూసింది. స్కూళ్ళకి, ఆఫీసులకి వెళ్ళే వేళమించి పోవడంచేత వీధిలో జనసమ్మర్ధం లేదు. ఒకవేళ పక్కవాటాల్లోకి గాని వెళ్ళి కబుర్లు చెప్తుతూ కూర్చున్నాడేమో! అనుకుంటూ, పక్కవాటా తలుపు తట్టి,

"సుందరీ! మా శ్రీధర్‌గాని ఇటు వచ్చాడా?" అని అడిగింది పక్కింటావిడని. పక్కింటి అంకుల్‌తో కేరమ్‌బోర్డు ఆడుకోవటానికి అప్పుడప్పుడు శ్రీధర్ వాళ్ళింట్లో దూరుతూ వుంటాడు. కాని సుందరి ఆశ్చర్యంగా చూస్తూ,

"రాలేదే! అయినా ఈవేళప్పుడు ఇటెందుక్కొ వస్తాడూ? వాడు స్కూలుకి వెళ్ళలేదూ?" అని అడిగింది. ఆమెకి ఏమని సమాధానం చెప్పాలో శ్యామలకి తోచలేదు. "స్కూలుకి యివాళ వెళ్ళ లేదు." అని మాత్రం చెప్పి మళ్ళీ యింట్లోకి వచ్చేసింది. అలా మెయిన్‌రోడ్డు వైపుగానీ వెళ్ళాడేమో అనుకుంటూ చేతికి అందిన పత్రిక తీసుకుని తిరగేస్తూ కూర్చుంది. ఆమె కళ్ళు అక్షరాల వెంట పరుగులు పెడుతున్నాయి గాని, ఒక్క అక్షరం గూడా ఆమె మనసుని చేరటం లేదు. ఎన్నికొట్టినా శ్రీధర్ యిన్నాళ్ళూ స్కూలు మానేసి ఎటు తిరుగుతున్నాడో చెప్పాడు కాదు. పదేళ్ళ వయసులోనే వాడిలా వుంటే వయసు మీద పడేకొద్దీ యింకా యెన్ని నేర్చుకుంటాడో? వీధిలో కూర్చోరా అంటే వినకుండా యెటో పోయాడు. అమ్మ మాటంటే అసలు ఖాతరు చెయ్యనివాడిని అదుపులో పెట్టడం యెలాగబ్బా? ఆడపిల్లకి తల్లి భయం, మొగపిల్లలకి తండ్రి భయం వుండాలంటారు! ఈయనేమో ఎంతసేపూ సంపాదించి పొయ్యడమే గాని పిల్లల విషయాలు అసలు పట్టించుకోరు! శ్యామల విసుగ్గా తల విదిలించి, పుస్తకం పక్కనున్న బల్లమీద పడేసి టైము చూసింది. పన్నెండవుతోంది. రాత్రి తిండి తినకపోవడం చేత కడుపులో ఆకలి రొద చేస్తోంది. ఎక్కడికి పోయినా కడుపులో ఆకలి కరకరమంటే వాడే వస్తాడు. అనుకుంటూ అన్నం పెట్టుకుని కూర్చుంది. మనసు అర్ధంలేని ఆందోళనతో నిండి వుండటంచేత అన్నం తిన బుద్ధికాలేదు. భోజనం అయాక నాలుగైదుసార్లు వీధిలోకి, యింట్లోకి కాలు కాలిన పిల్లిలా తిరిగిన శ్యామలకి యెక్కడ లేని నీరసం ముంచుకువచ్చేసింది. శ్రీధర్ మీది కోపం ఆందోళనగా మారింది. ఎటుపోయాడబ్బా వీడు? ఆకలికి అసలు తట్టుకోలేడే! ఎక్కడికి పోయినా తిండివేళకి వస్తాడనుకుంది. తిండివేళ దాటి టిఫెను వేళయినా వత్తాలేదు. ఏం చెయ్యడం? ఎవర్ని అడగడం? హఠాత్తుగా శ్యామలకి యెప్పుడో అవతలి వీధిలో ఒక పధ్నాలుగేళ్ళ కుర్రాడు, తండ్రి కొట్టేడని యిల్లు విడిచి పారిపోయిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. నాలుగేళ్ళనాడు అలా మాయమైన కుర్రాడు యీనాటి దాకా తిరిగి రాలేదు. ఈనాటికీ ఆ తల్లి తలుచుకు తలుచుకు యేడుస్తూనే వుంటుంది. ఆ ఆలోచన రాగానే శ్యామల ఆందోళన భయంగా మారింది. ఒకవేళ వీడు అలా యిల్లు వదిలి పారిపోలేదు

కదా? ఏమో! వాడి ఆలోచనలు యెటు లాక్కె వెళ్ళాయో! అయినా నిన్న వాడు తిన్న దెబ్బలు సామాన్యమైనవా? ఏనాడూ పిల్లల మీదకి చెయ్యెత్తని ఆయన కూడా కొట్టేసరికి హడలి పోయి వుంటాడు. రాత్రంతా తిండి తినలేదు. పొద్దున్న యెప్పుడో తిన్న చద్దన్నం! అయ్యో! చిన్న వెధవ ఆకలికి యెక్కడ అలమటిస్తున్నాడో! శ్యామలకి దుఃఖం ముంచుకువచ్చింది. రివ్వున తగులుతున్న దెబ్బల్ని తప్పించుకోలేక విలవిల్లాడిన శ్రీధర్ రూపమే ఆమె కళ్ళముందు మెదల సాగింది. తను తల్లా? రాక్షసా? ఎంత తప్పు చేసినా అలా కొట్టి చంపుకుంటారా పిల్లల్ని? ఇంక వాడు తన కంటబడకపోతే, తను జీవితాంతం వాడిని తలుచుకు కుములుతూ వుండవలసిందేనా? శ్యామల యింక అలా ఆలోచిస్తూ కూర్చోలేక గబగబ పక్కవాటా తలుపుతట్టి సుందరిని పిలిచింది. శ్యామల చెప్పిన సంగతి విని సుందరి నిర్ఘాంత పోయింది.

"ఎంతసేపైందీ వాడు వెళ్ళి?" అని అడిగింది కంగారుగా.

"పొద్దున్న నిన్ను అడిగాను చూడు! అంతకు ముందే!" సుందరి వయసులో శ్యామలకంటే చిన్నది. అందుకే పిల్లాడిని అంతలాగ కొట్టినందుకు పైకి చీవాట్లు పెట్టలేకపోయింది, కాని మనసులో 'అప్పుడు కొట్టడమెందుకు? ఇప్పుడు కంగారు పడటం యెందుకు?' అనుకుంటూ,

"ఏం చేద్దాం? అన్నయ్యగారికి ఫోన్ చేద్దామా?" అంది. శ్యామల మాట్లాడలేదు. ఆలోచిస్తూ నిల్చొంది. తీరా ఫోన్ చేసి, హడావిడి చేస్తే, వీడు యీ చుట్టుపక్కలే యెక్కడైనా వుంటే ఆయన విసుక్కుంటారేమో! అనుకుంటూ,

"ఇంకాస్సేపట్లో యెలాగూ ఆఫీసు నించి వచ్చేస్తారేమో! నేను అలా వాడి స్నేహితులిళ్ళకి వెళ్ళి చూసి వస్తాను. మా చిన్నపిల్లలిద్దరూ స్కూలునించి వస్తే కాస్త చూసుకోండి" అంది. ఇల్లు తాళంపెట్టి తనకు తెలిసిన శ్రీధర్ స్నేహితుల యిళ్ళకి వెళ్ళి వాకబు చేసిన శ్యామలకి నిరాశే యెదురైంది. నిరాశతో, ముంచుకు వస్తున్న దుఃఖంతో యింటికి వచ్చి శ్యామల, ఆఫీసునించి వచ్చిన తన కోసమే యెదురు చూస్తున్న భర్త చేతుల్లో భోరున ఏడుస్తూ వాలిపోయింది. మాధవ రావు భార్యని ఓదార్చి, జరిగిన విషయం తెలుసుకుని సైకిల్ వేసుకుని శ్రీధర్‌ని వెతకడానికి బయలుదేరాడు. మాధవరావుతో పాటు యిరుగు, పొరుగు మగవాళ్ళు నలుగురైదుగురు సైకిళ్ళేసుకు బయలుదేరారు. కాలం గడుస్తున్నకొద్దీ శ్యామల ధైర్యం అంతా దిగజారిపోయింది. వెక్కి వెక్కి ఏడుస్తున్న శ్యామల చుట్టూ యిరుగు పొరుగు ఆడవాళ్ళు చేరి ఓదార్చసాగేరు.

"కాస్త ధైర్యం తెచ్చుకోండి! ఎంతో దూరం పోయి వుండడు. ఈపాటికి వాళ్ళ నాన్నగారితో వస్తూనే వుంటాడు..." అని ఓదార్చుతూనే,

"మావూర్లో ఆమధ్య ఏం జరిగిందో తెలుసా?" అంటూ వీధిల్లో ఆడుకుంటున్న పసిపిల్లాడిని ఎత్తుకు పోయి, కాళ్ళు విరిచేసి బొంబాయిలో బిక్షగాడిగా యెలా మార్చిందీ వర్ణించి చెప్పసాగిందో ఇల్లాలు, మరో ఇల్లాలు, కొంచెం పెద్దపిల్లల్ని కొన్ని ముఠాలు దొంగలుగా యెలా మారుస్తారో, యెలా ట్రెనింగ్ యిస్తారో వర్ణిస్తూ, శ్యామలని మరింత అదరగొడుతోంది, సుందరి మాత్రం ఎక్కువగా వాళ్ళ కబుర్లలో పాలు పంచుకోకుండా మౌనంగా కూర్చుంది. ముందురోజు సాయంత్రం శ్రీధర్‌ని తల్లి, తండ్రి చావగొట్టడం సుందరికి తెలుస్తూనే వుంది. వాడి యేడుపు, కేకలు విని ఆగలేక పక్కింటికి బయలుదేరబోయిన ఆమెని భర్త,

"వాళ్ళ పిల్లల గొడవల్లో మనం కలుగజేసుకోవడం మంచిది కాదు. మన వల్ల వాళ్ళు పిల్లల ముందు చిన్నపుచ్చుకునే అవకాశం వుంది." అంటూ ఆపేశాడు. భర్త చెప్పింది సమంజసంగానే వుండటంతో సుందరి తన నిర్ణయం మార్చుకుని వూరుకుంది. శ్రీధర్ యిల్లు వదిలి పారిపోయాడని పూర్తిగా నిర్ధారణ చేసుకున్నాకే శ్యామల యేడుస్తూ జరిగిన సంగతి అంతా సుందరితో చెప్పింది. ముందరే దెబ్బలతో అదరగొట్టకుండా మంచిమాటలతోనే స్కూలు మానేసి యెక్కడ తిరుగుతున్నాడో కనుక్కుని వుంటే బాగుండేదని సుందరికి అనిపించినా, ఇంత జరిగాక అలాంటి సలహావల్ల శ్యామల మనసు మరింత బాధపెట్టడమే అవుతుందనిపించి, మౌనం వహించింది. రాత్రిపదకొండు గంటలవుతున్నా శ్రీధర్ జాడ తెలియలేదు. సైకిళ్ళమీద రైల్వే స్టేషన్‌వైపూ, వూళ్ళోని చుట్టాలిళ్ళవైపూ వెళ్ళిన

వాళ్ళు వెతికి వేసారి ఒకవేళ ఈపాటికి యింటికి వచ్చేడేమో అనుకుంటూ మాధవరావు యింటికి చేరుకున్నారు. అన్ని ప్రయత్నాలూ విఫలమయే యని తెలియగానే శ్యామలని పట్టడం యెవరితరం కాలేదు. దుఃఖోద్వేగంతో స్పృహ తప్పి పడి

[లోకజ్ఞానం - సమాధానాలు]

1. 1928 లో.
2. గోధుమ ఉత్పత్తిలో భారత దేశంలోనూ, ఇతర దేశాలలోనూ విశేషమైన కృషి చేసిన డా॥ నార్మన్ బొర్‌లాగ్, గౌరవార్థం కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ ఏర్పాటు చేసిన అవార్డు ఇది. మన దేశంలో విశేషమైన ప్రతిభ కనబరచిన విజ్ఞానవేత్తకు ప్రతి సంవత్సరం ఇచ్చే ఈ అవార్డులో ఒక బంగారు పతకం, పదివేల రూపాయల నగదు ప్రశంసా పత్రంతోపాటుగా ఇస్తారు. గత డిసెంబర్‌లో 1980 కి ఈ అవార్డు నాగపూర్‌లోని నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే డైరక్టర్ డా॥ ఆర్. ఎస్. మూర్తికి ఇవ్వబడింది.
3. ది ఇండియన్ కౌన్సిల్‌ఫర్ చైల్డ్ వెల్ఫేర్
4. సింగపూర్‌లో. 1976 లో
5. అప్పటి బ్రిటిష్ సైనికాధికారి సర్ ఎఫ్. ఆర్. రాయ్ బుచ్చర్ వద్ద నుంచి జనవరి 15. 1949 నాడు భారతదేశపు మొట్ట మొదటి సర్వసైన్యాధక్షుడుగా జనరల్ కె. ఎమ్. కరియప్ప పదవీ స్వీకారం చేశారు. అంచేత అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జనవరి 15 సైనిక దినంగా పరిగణింపబడుతున్నది.
6. ఆగస్టు 4, 1914 నాడు
7. ఆస్ట్రేలియాకు చెందిన డొనాల్డ్‌బ్రాడ్‌మన్ 29 సెంచారీలు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.
8. ఫిబ్రవరి 4, 1948 న. ఆ రోజు బ్రిటిషు వారి నుంచి వారికి స్వరాజ్యం సంక్రమించింది.
9. వై. బి. చవాన్
10. యాసర్ అరాఫత్. పాలస్తీనా విమోచనోద్యమ నాయకుడు.

పోయింది. అర్థరాత్రి కావస్తూ వుండటంచేత ఇరుగు పొరుగు వాళ్ళుయేవో తోచిన సలహాలిచ్చి వెళ్ళిపోయారు. సుందరి, చిన్న పిల్లలిద్దరికీ తమఇంట్లోనే అన్నాలు పెట్టి, నిద్రపుచ్చింది. సుందరీ కృష్ణమూర్తి యెంత బ్రతిమాలినా శ్యామలా, మాధవరావు భోజనాలు చెయ్యడానికి ఇష్టపడలేదు. శ్యామల చేత సుందరి పచ్చి మంచినీళ్లు కూడా తాగించలేక పోయింది. తెల్లవారుతూనే మాధవరావు కృష్ణమూర్తి సలహా ననుసరించి కొడుకు ఫోటో ఒకటి తీసుకుని పోలీస్‌స్టేషన్లో రిపోర్టిచ్చాడు. కాఫీలు గొంతుకలో పోసుకుని మగాళ్ళందరూ సైకిళ్ళేసుకుని వీధిన పడ్డారు. అమ్మలక్కలు శ్యామల చుట్టూచేరి ఆమెని ఓదార్చలేక మామూలు కబుర్లలో పడిపోయారు. శ్యామలకి స్పృహ వచ్చినప్పుడు శ్రీధర్‌ని తలుచుకు, తలుచుకు యేడుస్తోంది. మధ్య మధ్య ఫిట్స్ వచ్చి పడిపోతోంది. మాధవరావు పోలీసురిపోర్టిచ్చి, అలాగే మద్రాసులో వున్న శ్యామల తండ్రికి రిప్లై టెలిగ్రామ్ కూడా ఇచ్చాడు. పైకి గంభీరంగా వున్నా, అతని మనఃస్థితి శ్యామల కంటే అధ్వాన్నంగా వుంది. పిచ్చివాడిలా వూరంతా తిరగ సాగేడు.

❋

సుందరికి అమ్మలక్కల కబుర్లు విసుగనిపించి యధాలాపంగా లేచి బయటికి వచ్చి వీధిలోకి తొంగి చూసింది. దూరంగా, వీధిమొగలో తూలుకుంటూ వస్తున్న శ్రీధర్‌ని చూడగానే సంతోషంగా కేకవెయ్యబోయి, వెంటనే తమాయించుకుని పరిగెట్టుకుంటూ ముందుకు వెళ్ళి శ్రీధర్ చెయ్యి పట్టుకుంది. శ్రీధర్ చలితోనో, భయంతోనో గజ గజ వణుకుతూ సుందరిని కౌగలించుకుని బావురుమన్నాడు.

"ఎక్కడికి పోయావురా?" అంటూ ప్రేమగా వాడితల నిమిరి,

"ఇప్పుడేం చెప్పొద్దులే! పద అన్నం పెడతాను" అంటూ వాడిని మిగతా వాళ్ళ కళ్ళబడనివ్వకుండా తమ వాటావైపు తీసుకుపోయింది.


❋

శ్యామలకి ఎక్కడో దూరంగా శ్రీధర్ కంఠం వినిపించినట్టై దిగ్గున లేచి కూర్చుంది. సరిగ్గా అప్పుడే తిరిగి, తిరిగి అలసిపోయి ఇంటిదగ్గర పరిస్థితి చూద్దామని ఇంటికి వచ్చి, పక్కవాటాలో నించి శ్రీధర్ మాటలు వినపడ్డంతోటే ఆతృతగా అటువైపు నడిచాడు మాధవరావు. గిన్నెలో మజ్జిగ అన్నం పల్చగా కలిపి శ్రీధర్‌కి స్పూనుతో తాగిస్తోంది సుందరి! శ్రీధర్ మధ్య, మధ్య వెక్కెక్కి పడుతూ ఏడుస్తూ,

"పండక్కి రెండ్రోజులు శలవులొచ్చినప్పుడు మా మాస్టారు ఇరవై లెఖ్ఖలు హోమ్ వర్క్ యిచ్చారు ఆంటీ! శలవులైపోయి., మళ్ళీ స్కూలుకి వెళ్ళే రోజు దాకా నాకా సంగతి గుర్తులేదు. మాకు లెఖ్ఖలకి మా హెడ్‌మాస్టరు వస్తారు. ఎన్ని లెఖ్ఖలు చేసుకురాకపోతే అన్ని దెబ్బలు తినాల్సి వుంటుందని ముందే చెప్పాడాయన. మామూలుగా బెత్తంతో అయితే ఫరవాలేదు కాని ఆయన చెయ్యి తిరగేయించి రూళ్ళకర్రతో కొడతాడు. ఒకసారి ఒక్క దెబ్బకే నా ప్రాణం పోయినంత నొప్పెట్టింది. అలాంటివి యిరవై దెబ్బలనేసరికి బెంగపట్టుకుంది. ఎలా తప్పించుకోవాలో అర్థం కాలేదు. స్కూలుకి వెళ్ళకపోతే అమ్మ కొడుతుంది! అందుకని ఆ రోజు స్కూలు టైముకి బయలుదేరి, స్కూలుకి వెళ్ళే దారిలో ఒక చింతలతోపు వుంది లే, అక్కడికి పోయి కూర్చుని, మళ్ళీ స్కూలు వదిలేవేళకి యింటికి వచ్చేశాను. ఆ రాత్రి లెఖ్ఖలు చెయ్యడానికి ప్రయత్నించాను గాని ఆన్సర్లు రాలేదు. అదీ గాకుండా ముందు రోజుకి లీవ్‌లెటరు లేకుండా వెళితే క్లాసులోకి రానివ్వకపోవడమే గాకుండా, పేరెంట్స్‌కి రిపోర్టు చేస్తారు. మర్నాడు మళ్ళీ యేం చెయ్యాలో తోచక ముందు రోజులాగే చింతల తోపులోకిపోయి కూర్చున్నాను. తర్వాత నాకు అదే బాగున్నట్టనిపించి, అలాగే రోజూ అక్కడికి పోయి కూర్చునేవాడిని! మరి అమ్మకి యెలా తెలిసిందో నేను స్కూలుకి వెళ్ళనట్టు, తెలిసిపోయింది! అమ్మ, నాన్న నన్ను యెలా కొట్టేరో చూశావా? ఇంకా ఈ దెబ్బలు సలుపుతూనే వున్నాయి. ఆ దెబ్బలతో గొడవ వదిలిపోతుంది, అమ్మ లీవ్ లెటరు యిస్తే మామూలుగా మళ్ళీ స్కూలుకి పోదామనుకుంటే, అమ్మ నిన్న పొద్దున్న 'వెధవా! అప్పుడే అయిపోయిందనుకుంటున్నావేమిటి? వచ్చి మీ హెడ్‌మాస్టరుతో నీ నిర్వాకమంతా చెప్తానుండు!' అంది. దాంతో నాపై ప్రాణాలు పైనే పోయాయి. ఒక లెఖ్ఖ తప్పుచేస్తేనే అరిచేతి తోలు వూడిపోయేటట్టు బెత్తంతో కొడతాడాయన! ఇన్ని రోజుల్నించీ స్కూలుకి రాకుండా, చింతలతోపులో తిరుగుతున్నానంటే నన్ను బ్రతకనిస్తాడా? అని భయమేసింది. వీళ్ళందర్నీ తప్పించుకుని యెక్కడికైనా దూరంగా పారిపోవాలనిపించింది. అమ్మ స్నానం చెయ్యడానికి లోపలికి వెళ్ళినప్పుడు నెమ్మదిగా వీధిలోకి జారుకున్నాను" అంటూ దుఃఖం ఆపుకోలేక భోరుమన్నాడు. మాధవరావు ఆశ్చర్యంగా భార్యవైపు చూశాడు. భార్యా, తనూ, ఈ విషయం స్కూల్లో తెలియనివ్వకూడదని నిర్ణయించుకున్న సంగతి భార్య యెలా మరిచిపోయిందో అతనికి అర్థం కాలేదు. శ్యామల భర్త చూపుల నర్థం చేసుకుని, తప్పు చేసినదానిలా చటుక్కున తల వంచుకుంది. సుందరి గుమ్మం దగ్గర నిల్చున్న ఆ భార్యా, భర్తల్ని చూసి కూడా చూడనట్టు నటిస్తూ,

"అలా చెప్పకుండా పారిపోవచ్చా? మరి నిన్నటినించీ యెక్కడికి పోయావు? అమ్మలా నీకు యెవరైనా అన్నం పెట్టారా?" అంది.

"లేదు ఆంటీ! మరి యింకెప్పుడూ అలా చెయ్యను! నిన్నట్నించీ, ఆర్ట్సుకాలేజీ ప్లేగ్రవుండ్‌లో కూర్చున్నాను. రాత్రి ఆకలి, చలి భరించలేక యింటికి వచ్చేద్దామనుకున్నానుగానీ, అమ్మ కోపం, హెడ్‌మాస్టర్ దెబ్బలు జ్ఞాపకం వచ్చి అలాగే వుండిపోయాను. ఇవాళ మధ్యాహ్నం అయేసరికి యింక ఆకలితో ప్రాణం పోతుందేమోననిపించింది. అమ్మతో అంతా చెప్పేసి చచ్చిపోయినా ఫరవాలేదనిపించి యింటివైపు వచ్చేశాను." అంటూ శ్రీధర్ ఆంటీ తన మాటల్ని వినకుండా గుమ్మం వైపు చూస్తూ వుండటం గమనించి, తనూ తల తిప్పి తల్లిదండ్రుల్ని చూసి, పెద్దగా యేడుస్తూ వచ్చి తల్లిని వాటేసుకున్నాడు. శ్యామల కూడా వెక్కి వెక్కి యేడుస్తూ వాడిని ముద్దులతో నింపేసింది. □



మీ కనురెప్పల వెంట్రుకలు పెరగాలని వుంటే రాత్రి పడుకునే ముందు కొబ్బరినూనె రెప్పలకు పూసి పడుకోండి.